

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

బేగంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్మార్ట్ విజన్ ఆస్పత్రి, డా.మోహన్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘమిత్ర క్లబ్ కో-ఆర్డినేటర్ డా.పి.బాల్‌రెడ్డి, డా.పి.ఎస్.రజని పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వేణు కళ్యాణ్

పరిశ్రమల అభివృద్ధికి అధునాతన వ్యూహాలు

బేగంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు మార్కెటింగ్ విస్తరణ, సేల్స్ పెంచుకోవడం, టీమ్ స్పిరిట్ తదితర అంశాలు ప్రధానమైనవని ప్రముఖ వ్యాపార అభివృద్ధి వ్యూహకర్త వేణు కళ్యాణ్ అన్నారు. యునిక్ లైఫ్ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో వ్యాపార రంగంలో ఎలా అభివృద్ధి సాధించాలి..? అనే అంశంపై 'అల్టిమేట్ బిజినెస్ మాస్టర్ వర్క్‌షాప్'ను బేగంపేటలోని తాజ్ వివంతాలో సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు పలు రాష్ట్రాల నుంచి 300కు పైగా వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. వ్యాపార సందేహాలపైన, విజయాలపైన ఆయన ప్రసంగించారు. సదస్సులో ఎఫ్.టి.సి.సి.ఐ అధ్యక్షుడు ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



హామ్స్‌టెక్ లాంచ్‌ప్యాడ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ శర్మ, హామ్స్‌టెక్ సీఈవో అజితరెడ్డి

లాంచ్‌ప్యాడ్‌ను ఆవిష్కరించిన హామ్స్‌టెక్

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువ పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించేందుకు హామ్స్‌టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ హామ్స్‌టెక్ లాంచ్‌ప్యాడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సోమవారం పంజాగుట్ట నాగార్జున సర్కిల్‌లోని హామ్స్‌టెక్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఎక్స్‌టెన్షన్(ఎస్ఈఈ) డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ శర్మ, హామ్స్‌టెక్ సీఈవో అజితరెడ్డితో కలిసి హామ్స్‌టెక్ లాంచ్‌ప్యాడ్‌ను ఆవిష్కరించారు. సృజనాత్మకతను ప్రోత్సహించడంలో సంస్థ పోషిస్తున్న పాత్రను ఆయన అభినందించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆలోచనలను అర్థవంతమైన వ్యాపారాలుగా మార్చడానికి విశ్వాసాన్ని అందించడానికే హామ్స్‌టెక్ లాంచ్‌ప్యాడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని హామ్స్‌టెక్ సీఈవో అజితరెడ్డి అన్నారు. వ్యాపార సెటప్, లైసెన్సింగ్, బ్రాండింగ్, ఉత్పత్తి అభివృద్ధి, ఇ-కామర్స్, డిజిటల్ ఇంటిగ్రేషన్, ప్రొఫెషనల్ ఫొటోషూట్‌లు, కంటెంట్ సృష్టి ధర, అమ్మకాల వ్యూహం, తదితర అంశాలపై విద్యార్థుల ప్యానెల్ చర్చ కూడా జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రజల సంతకాలు సేకరిస్తున్న యువకులు

రహ్మత్ నగర్ కూడలి నుంచి వైన్స్ తరలించాలి

బోరబండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న, ట్రాఫిక్ చిక్కులు తెస్తున్న రహ్మత్ నగర్ కూడలిలోని వైన్స్‌ను మరోచోటకు తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వైన్స్‌ను ఆనుకొని ఉన్న గ్రంథాలయం చుట్టూ మందుబాబులు మూత్రవిసర్జన చేస్తుండటంతో ఇటు పాఠకులకు, అటు ప్రజలకు తీవ్ర అవస్థ కలుగుతోందని తెలిపారు. వైన్స్ వల్ల కలుగుతున్న ఇబ్బందిని గుర్తించిన స్థానిక యువకుడు గడ్డం శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. గతంలో తాము వైన్స్ తరలింపు విషయంలో అధికారులను కలిస్తే మరోసారి అక్కడ కేటాయించబోమని చెప్పారని, కానీ ఈసారి కూడా అదేచోట కొత్త వైన్స్ ఏర్పాటు చేశారని యువకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ప్రజల సంతకాలు సేకరించి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్, ఎక్సైజ్ అధికారులకు సమర్పిస్తామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వైన్స్‌ను మరోచోటకు తరలించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. గడ్డం శ్రీధర్, అశోక్ యాదవ్, ముత్యం శ్రీనివాస్, మధు, నర్సింహ, సుధాకర్ సంతకాల సేకరణలో పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి పడి పూజలో ఎమ్మెల్యే తలసాని

వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

బేగంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని బి.కె.గూడ కు చెందిన నీరుడు కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

తార్నాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు పి. కుమార్ వంశిరాజ్ సోమవారం పలువురు స్థానిక యువకులతో కలిసి సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఎస్. జగన్, వంశీ, యశ్వంత్, పి. మల్లేష్, ఏ. శ్రీనివాస్, ఎస్. చందు, చంద్రశేఖర్, శ్రీకాంత్, దాస్, ప్రసాద్, సూర్య భగవాన్, చిన్ను తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దైనందిన జీవితంలో ధ్యానం, శాంతి అతి ముఖ్యం



కన్హశాంతి వనాన్ని సందర్శించిన సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు

ఎర్రగడ్డ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి దైనందిన జీవితంలో శాంతి, ధ్యానం అనేవి ముఖ్యపాత్ర పోషిస్తాయని, వీటిపై విద్యార్థులకు చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఫౌండర్ సీఈవో ఏ మోహనవంశీ అన్నారు. ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు సోమవారం షాద్ నగర్‌లోని కన్హశాంతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందని, ధ్యానంతో ఎంతటి క్లిష్ట పరిస్థితులనైనా జయించవచ్చని విద్యార్థులకు చెప్పారు. విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ అనే అంశంపై పోస్టర్ల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యానికి సంబంధించిన వివిధ రకాల పోస్టర్‌లను తయారు చేశారు. విద్యార్థులు శాంతి వనంలోని ఉద్యానవనాలు, జ్ఞాన కేంద్రం తదితర ప్రదేశాలను సందర్శించారు. విద్యార్థులకు గ్లోబల్ గీతోపదేశం సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఏ మధుమతి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వింటర్ ఉత్సవ్ మేళాలో సందడే సందడి



మేళాలోని సెరియాల్ జలపాతం వద్ద సందడి చేస్తున్న సందర్శకులు

ఖైరతాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీపుల్స్‌ప్లాజా వేదికగా నడుస్తున్న వింటర్ ఉత్సవ్ మేళా నగరవాసులకు మరవలేని అనుభూతిని ఇస్తోంది. ఏనాడో అంతరించిపోయిన వేల సంవత్సరాల నాటి బీసి జంతువులు, సెరియల్ వాటర్ ఫాల్, అంటార్కిటికా అందాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 75 అడుగుల ఎత్తుతో ఏర్పాటైన లండన్ బిగ్ బ్యాన్ టవర్ గుండాలోనికి వెళ్లగానే 50 అడుగుల ఎత్తు, 125 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేసిన సెరియల్ వాటర్ ఫాల్ నుంచి జలజల పారే వాటర్ ఫాల్ నీటిధారలు, సందర్శకుల పాదాలను తాకుతూ ఇట్టే మాయమయ్యేలా సెట్టింగ్ ఆకట్టుకుంటోంది. వేల సంవత్సరాల క్రితం మనుగడలో ఉండి నేడు కనిపించని డైనోసార్, ఉలి రైనో, మహ్మద్, షీ లయన్, పోలార్ బీర్, పెంగ్విన్‌లను మంచు కొండల్లో చూపిస్తున్నారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన వస్తువులతో కూడిన ప్రత్యేక స్టాళ్లలో సందర్శకులు నచ్చినవి కొనుగోలు చేస్తూ ప్రదర్శనలోని ఎలు ఎమ్యూజ్‌మెంట్ల వద్ద యువత, పిల్లలు ఎంజాయ్ చేస్తున్నారు. మేళా ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ తెలిపారు.

సికింద్రాబాద్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను విడుదల చేస్తున్న పవన్ కుమార్ గౌడ్, బాల్‌రాజ్ యాదవ్ తదితరులు

పంజాగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)లో నగర శివారులోని 20 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లను విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఇప్పటికే వెనకబడిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంకా వెనకబడే ప్రమాదం ఉందని, సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిధుల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను ఆయన సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, కోశాధికారి అబ్దుల్ అజీజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు గీతతో కలిసి ఆయన విడుదల చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం ఉన్న 150 డివిజన్ లలోనే సరిపడా సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులలో నగర పరిధిని ఓఆర్ఆర్ వరకు విస్తరిస్తే ప్రజలు మరింత ఇబ్బంది పడతారని అన్నారు. ఈ నేపథ్యంలో ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిని ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సమితి నాయకులు సునీల్ కుమార్, జగదీష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ ముదిరాజ్, ఎస్.కె.అశోక్ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న పీఎల్ఎన్ రావు

పంజాగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణలో ప్రభుత్వం, పీసీబీ పూర్తిగా విఫలమయ్యాయని పర్యావరణ స్వచ్ఛంద సంఘాల వేదిక ప్రతినిధులు ఆరోపించారు. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారుల పనితీరు, ప్రజల ఇబ్బందులపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదిక ప్రతినిధులు ఎన్విరాన్‌మెంట్ సోషల్ వర్కర్ పీఎల్ఎన్ రావు, ఎస్.నాగసేనారెడ్డి, వి.సునందరెడ్డి, డి.అంజయ్య మాట్లాడుతూ నగరంలో వాయు కాలుష్యం పెరుగుతోందని, పరిస్థితి ఇలానే ఉంటే నగరం మరో ఢిల్లీగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పఠాన్‌చెరు, జీడిమెట్ల, రామచంద్రాపురం, చౌటుప్పల్, తదితర పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు పూర్తి స్థాయిలో శుద్ధి చేయకుండా నేరుగా నాలాల ద్వారా విడుదల చేయడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, పంటలు దిగుబడి రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. దుండిగల్ పరిధిలోని దోమడుగు గ్రామ ప్రజలు ఈనెల 12న మహాధర్నాకు పిలుపునిచ్చారని తెలిపారు.

టీటీఏ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

● నేటి నుంచి 23 వరకు ● 25న శిల్పకళావేదికలో పదో వార్షికోత్సవం



సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ అమెరికా తెలుగు సంఘం నాయకులు

పంజాగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమెరికా తెలుగు సంఘం(టీటీఏ) ఆధ్వర్యంలో టీటీఏ సేవా డేస్‌లో భాగంగా నేటి నుంచి 23 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సేవా, సాంస్కృతిక, వ్యాపార, విద్య, ఆరోగ్య, ఆధ్యాత్మిక, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మలిపెద్ది తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సేవా డేస్ సలహాదారు డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి, సమన్వయకర్త విశ్వ కంది, ఉపాధ్యక్షుడు నర్సింహ పెరుక, డి.జ్యోతిరెడ్డి, స్వాతి చెన్నూరి, ప్రవీణ్ చింత, డాక్టర్ నర్సింహారెడ్డి దొంతిరెడ్డితో కలిసి రాష్ట్రంలో నిర్వహించనున్న సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. అమెరికాలోని 32 రాష్ట్రాల్లో సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పలు కార్యక్రమాలు, ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి అమెరికాలో టీటీఏ మెగా కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 2026 జూలై 17 నుంచి 19 వరకు అమెరికా నార్త్ కరోలినాలోని చార్లోట్టేలో మెగా కన్వెన్షన్ నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. 25న మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో టీటీఏ పదో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అడ్వైజరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, కో-చైర్మన్ డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ వాణి గడ్డం, రమాకుమారి, సంగీతరెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యం పెంచుకోవాలి

● డా.బి.ఆర్ అంబేద్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డా.ఎల్. విజయకృష్ణారెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు ఆయా రంగాల్లో వస్తున్న ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డా.బి.ఆర్.అంబేద్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లో డా.బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్(సి.ఎస్.టి.డి) ఆధ్వర్యంలో అధ్యాపకేతర సిబ్బందికి పదిరోజులపాటు జరిగే 'కార్యాలయ నిర్వహణ' అనే అంశంపై శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఐసీటీపై పట్టు సాధించడమంటే పనిచేసే సంస్థపై పూర్తి అవగాహన కలిగి ఉండడమని పేర్కొన్నారు. సీఎస్‌టీడీ డైరెక్టర్ ప్రొ.పి.వెంకట రమణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సీఎస్‌టీడీ ఆధ్వర్యంలో అధ్యాపకేతర సిబ్బందికి వివిధ అంశాలపై మరిన్ని శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శిక్షణా తరగతుల్లో అన్ని విభాగాల అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లు అందజేస్తున్న నర్సింగ్‌రావు

పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్ల పంపిణీ

బంజారాహిల్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు శ్రీ పెద్దమ్మతల్లి ఎలక్ట్రికల్స్ ఫౌండర్ అభిమన్యు ఆధ్వర్యంలో స్వెట్టర్లు పంపిణీ చేశారు. సోమవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని భగీరథ మహర్షి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ ప్రారంభించి సుమారు వంద మంది కార్మికులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగేష్ సాగర్, సహదేవ్, ఎస్పీ శ్రీను, కరణం శ్రీను, జి.మురళీ సాగర్, దయ్యాల దాసు పాల్గొన్నారు.

తమిళనాడు ఎన్నికల ఇన్‌చార్జిగా డా.పద్మ వీరపనేని



డాక్టర్ పద్మ వీరపనేని

బోరబండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బీజేపీ ఇన్‌చార్జిగా మహిళా మోర్చా జాతీయ నాయకురాలు డాక్టర్ పద్మ వీరపనేని నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వణతి శ్రీనివాసన్ నియామకాన్ని ప్రకటించారు. తనను నియమించిన ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, వణతి శ్రీనివాసన్, పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



నల్లబ్యాడ్జీలతో నిమ్స్‌లో నిరసన తెలుపుతున్న నర్సింగ్ ఉద్యోగులు

నిమ్స్ నర్సింగ్ ఉద్యోగుల నిరసన

నిమ్స్, డిసెంబరు 8 ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఉద్యోగులు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆస్పత్రిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తమ సమస్యలపై నిమ్స్ యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా ఎటువంటి స్పందన లేదని నిమ్స్ నర్సుల యూనియన్ అధ్యక్షురాలు ఆశాలత, ప్రధాన కార్యదర్శి కృష్ణ తేజావత్ ఆరోపించారు. ఈఎల్ఎస్ క్యాష్‌మెంట్‌ను నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదించినా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ జీవో ఎంఎస్ నెంబర్.56 ప్రకారం ఉద్యోగి రిటైర్డ్‌మెంట్ అనంతరం ఇచ్చే గ్రాడ్యుటీ రూ.16 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, రూ.12 లక్షలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగులకు మూడు నెలలు శిశు సంరక్షణ సెలవులు ఇవ్వాలని కోరారు. సుమారు వెయ్యి మంది నర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలుపుతూ విధుల్లో పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న పాత్రికేయులు

మానవ వనరులను తగ్గిస్తున్న ఏఐ

పంజాగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిగా గమనిస్తున్న, అనుసరిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) మానవ వనరుల వినియోగాన్ని పూర్తిగా తొలగిస్తుందన్నది వాస్తవం కాదని సీనియర్ జర్నలిస్టు, ఏఐ నిపుణుడు ఉడుముల సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ హైదరాబాద్, ఏఐ ఫర్ డిజిటల్ రెడినెస్ అండ్ అడ్వాన్స్‌మెంట్(ఏడీఏఆర్ఏ), డేటాలీడ్స్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం సోమవారం ఆయన వర్క్‌షాప్ నిర్వహించారు. ఏఐ వినియోగం కారణంగా మానవ వనరుల వినియోగం తగ్గుతుందని, ఇది మానవాళికి ఓ సహాయకారి మాత్రమే అవుతుందని ఆయన అన్నారు. డేటా సెట్స్, వెబ్‌సైట్లలో ఉన్న సమాచారమే ఏఐ ద్వారా మనకు అందుతుందని, ఈ కారణంగానే సమాజంలో ఉన్న వివక్ష మొత్తం అందులో కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరికీ దీనిని నివారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతి జర్నలిస్టూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉందని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వివిధ రంగాలకు చెందిన పలువురు జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి వరికుప్పల రమేష్, ఉపాధ్యక్షుడు రాజేష్, కోశాధికారి రమేష్ వైట్ల, సంయుక్త కార్యదర్శి వి.బాపురావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త మృతి



మక్బుల్ పాషా

బోరబండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్ హెచ్ఎఫ్ నగర్ ఫేజ్-2కు చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త ఎం.డి.మక్బుల్ పాషా(62) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. దివంగత సీఎల్పీ మాజీ నేత జనార్దన్‌రెడ్డితో కలిసి పనిచేసిన వారిలో మక్బుల్ పాషా ఒకరని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. భౌతిక కాయాన్ని రహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బి.భవానీ శంకర్, పార్టీ సీనియర్ నాయకులు ఎం.డి.జాఫర్ హుస్సేన్, గ్యార నాగరాజు తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మక్బుల్ పాషా అంత్యక్రియలు స్థానిక రహ్మత్ నగర్ కబ్రస్తాన్‌లో సోమవారం సాయంత్రం జరిగాయి.



చెన్నకేశవులుకు డాక్టరేట్

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని వెస్లీ డిగ్రీ కళాశాలలో పనిచేసే నల్లమోపు చెన్నకేశవులకు జేజేటీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రాజస్థాన్‌కు చెందిన శ్రీజగదీష్ ప్రసాద్ జబర్‌మల్ టిబ్రేవాల యూనివర్సిటీ (యూనివర్సిటీ)లో కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ ప్రసాదు పెద్ది పర్యవేక్షణలో ఎఫిషియెంట్ క్లస్టర్ హెడ్ సెలక్షన్ అండ్ డాటా అగ్రిగేషన్ స్ట్రాటజీ యూసింగ్ ఎన్‌హాన్స్‌డ్ లీచ్ ప్రోటోకాల్ ఫర్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్స్ అనే అంశంపై ఆయన విజయవంతంగా పరిశోధనను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన చెన్నకేశవులును వెస్లీ కళాశాల డైరెక్టర్ & ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విమల్ సుకుమార్, డాక్టర్ పిఎం మోహన్, డాక్టర్ విఆర్‌కె రాజు ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

'లంబాడాలకు ఎస్టీ హోదా కొనసాగిస్తే ఉద్యమమే'

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లంబాడాలకు ఎస్టీ హోదా కొనసాగిస్తే ఉద్యమం తప్పదని ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బట్ట వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజ్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం నాయకులు రేగా శ్యామ్, కోర్సా ధర్మరాజు, కోడెం పాపారావు, సువార్త, ఈసం పవన్ కుమార్, పెందూరు సోనేరావు పాల్గొన్నారు.

విజేతలకు ట్రోఫీలు అందజేత

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేటి యువత, విద్యార్థులు విద్య, ఉద్యోగాలతో పాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకుని భావి తరాలకు స్ఫూర్తిగా నిలవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆకాంక్షించారు. సికింద్రాబాద్ వైఎంసీఏ గ్రౌండ్‌లో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎం సంపత్ కుమార్ మెమోరియల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని గత 40 రోజులుగా హైదరాబాద్ సిటీ పరిధిలోని కాలేజీలు, స్టేట్ గవర్నమెంట్, సెంట్రల్ గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్ల విభాగాలుగా నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో 49 టీంలు, మహిళల విభాగంలో 12 టీంలు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్స్‌లో విజేతలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ట్రోఫీలను అందించారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ కమిషన్ చైర్మన్ నార్మన్ ఐజాక్, మాజీ ఇండియా కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్, మాజీ అంతర్జాతీయ క్రీడాకారులు ఉమాకాంత్, బాలకృష్ణా రెడ్డి, హెడ్ కోచ్ యూజింగ్ జార్జ్, రిఫరీ పీటర్ సంతోష్ దివాకర్‌లు పాల్గొన్నారు.



పాఠశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్‌రెడ్డికి టెన్త్ ఫీజు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న కావ్య కిషన్ రెడ్డి

విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలి

అడ్డగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలని కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి తెలిపారు. ఆమె మాట్లాడుతూ టెన్త్ చదువుతున్న విద్యార్థులకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సొంత నిధులతో ఫీజులు చెల్లిస్తున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. సోమవారం అడ్డగుట్ట ఉన్నత పాఠశాలలో చదువుతున్న 96 మంది టెన్త్ విద్యార్థులకు ఫీజు మంజూరు పత్రాన్ని పాఠశాల ప్రిన్సిపాల్, డిప్యూటీ ఐఏఎస్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు. విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకుని ఇంటర్‌లో ఏ సబ్జెట్ తీసుకోవాలో మీరే నిర్ణయించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్, డిప్యూటీ ఐఏఎస్ అధికారి మధన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ అంబర్‌పేట్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల పేరు ఎవరికీ తెలియదని కిషన్‌రెడ్డి స్కూలు అంటేనే ప్రజలకు తెలుస్తుందన్నారు. ప్రభుత్వ స్కూలులో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు ఫీజు సాయం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, మాజీ మేయర్ బండారు కార్తీకారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య, కన్నాబిరాం, వసంత నాయక్, బీజేవైఎం అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్, నరేందర్, సాయి, సాయన్న, వేణు, వీరేశం, శివాజీ, శ్యామల, రాము, శంకర్, కృష్ణమూర్తిలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దీపక్ జాన్

కాయిర్ పోటీలు ప్రారంభం


తిరుమలగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హోలీ ఫ్యామిలీ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన 36వ కాయిర్ ఫెస్టివల్‌ను క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏర్పాటుచేస్తున్న కాయిర్ పోటీల్లో నగరవ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్ సంస్థలకు చెందిన కళాశాల, పాఠశాలకు చెందిన 11 టీమ్‌లు పాల్గొన్నాయని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, అల్వాల్ మునిసిపాలిటీ మాజీ చైర్మన్ జీవకన్, మైకేల్ అబ్రహం, రేమండ్ హర్వుడ్, ఫాదర్ రెవరండ్ సగ్గె రాజా, మారెడ్డి, చార్లెస్ పాల్గొన్నారు.



బోయినపల్లిలో పనులను పరిశీలిస్తున్న బోర్డు ఇంజనీర్ రాజేశ్వర్

త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తాం

బోయినపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు ఒకటో వార్డులో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని బదిలీ పైన ఒకటవ వార్డుకు వచ్చిన బోర్డు ఇంజనీర్ రాజేశ్వర్ అన్నారు. వార్డు పరిధిలోని బాపూజీ నగర్ కంసారి బజార్, చిన్నతోకట్ట, సంచరపూరి కాలనీ ఫేస్ 2 పెన్షన్ లైన్‌లతో పాటు, ఇతర బస్తీల్లో ఆయన సోమవారం పర్యటించి పలు సమస్యలు తెలుసుకున్నారు. గుంతలమయంగా మారిన అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ ఏర్పాటు, ఇతర సమస్యలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లనున్నట్లు ఇంజనీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చౌహాన్ దాఫెదార్ విజయ్, షకీబ్ హుస్సేన్, వరప్రసాద్, మోహన్, ముకేశ్ యాదవ్, జంపన రవి, ఇస్మాయిల్, చోటు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

కార్పొరేటర్ నిధులతో అభివృద్ధి

పద్మారావునగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ నిధుల నుంచి కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపడతామని పద్మారావునగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన ఈశ్వరమ్మబస్తీలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, శానిటేషన్, వీధి లైట్లు, నీటి సమస్య, పారిశుధ్యం, విద్యుత్ తదితర సమస్యల గురించి ఆయనకు తెలిపారు. వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ పర్యటనలో జీహెచ్ఎంసీ వాటర్‌వర్క్స్ ఏఈ నవ్య, స్ట్రీట్ లైట్ శ్రీకాంత్, ఎస్ఎస్ ధనాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, అధ్యక్షులు రాజు, సుధాకర్ రెడ్డి, ముక్క శ్రీనివాస్, అంబులెన్స్ సురేష్, కుషాల్, రవి, మహేందర్ గౌడ్, శ్రీరాములు, నాట లక్ష్మి, హరిచారి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ నేషనల్ ఉమెన్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎమ్మీ



బిషప్ మద్దేళ్ల ఎమ్మీ

తార్నాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్‌సీసీ) నేషనల్ ఉమెన్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా బిషప్ మద్దేళ్ల ఎమ్మీ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఎన్‌సీసీ ఫౌండర్ ప్రెసిడెంట్ రెవరెండ్ డా.సామ్‌పాల్, జాతీయ ఉపాధ్యక్షురాలు రెవ బ్రైటీ బ్యూలా తమ కార్యాలయంలో ఎమ్మీ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళా సాధికారిత, వారి అభివృద్ధి, శ్రేయస్సుకు అంకితభావంతో సేవ చేస్తానన్నారు. ఎన్‌సీసీ మహిళా విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన ఎన్‌సీసీ జాతీయ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మీ నియామకంపై ఎన్‌సీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

10న గన్‌బజార్ కమ్యూనిటీ హాలులో

కంటోన్మెంట్ వాణి పునఃప్రారంభం



కంటోన్మెంట్ వాణి పునఃప్రారంభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీగణేశ్

సికింద్రాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడిన కంటోన్మెంట్ వాణి పునఃప్రారంభం కానుంది. జీహెచ్ఎంసీ, రెవెన్యూ తదితర విభాగాలు నిర్వహిస్తున్న తరహాలోనే, కేంద్ర రక్షణ శాఖ పరిధిలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో ఈ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యుడు శ్రీగణేశ్ ప్రారంభించిన సంగతి విదితమే. ఒక్కో నెల, ఒక్కో వార్డులో కంటోన్మెంట్ వాణి నిర్వహిస్తామని, ప్రతి నెలా 10వ తేదీన జరిపే ఈ కార్యక్రమానికి ప్రభుత్వంలోని అన్ని విభాగాల అధికారులతోపాటు కంటోన్మెంట్ బోర్డు అధికారులు కూడా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ మేరకు రెండు నెలల క్రితం బోయినపల్లిలోని కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన తొలి సమావేశానికి అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజల నుంచి ఫిర్యాదులు, విన్నపాలను స్వీకరించారు. తాజాగా మళ్లీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యే నిర్ణయించారు. 10వ తేదీన రసూల్‌పురా గన్‌బజార్ కమ్యూనిటీ హాలులో 'కంటోన్మెంట్ వాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుతోపాటు ప్రభుత్వ విభాగాలైన రెవెన్యూ, విద్యుత్, పౌర సరఫరాలు, పోలీసు, అటవీ శాఖ తదితర విభాగాల ఉన్నతాధికారులు హాజరవుతారని, ప్రజలు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా, వారి వద్దకు వచ్చే అధికారుల దృష్టికి తమ సమస్యలు తీసుకురావాలని ఆయన సూచించారు. కాగా గన్‌బజార్‌లో నిర్వహించే కంటోన్మెంట్ వాణి ఏర్పాట్లను సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సమీక్షించారు.



నాయకులు, కార్యకర్తలతో డ్యాన్స్ చేస్తున్న మాజీ ఎంపీ హన్మంతరావు



సభకు హాజరైన మహిళలు

సీతాఫల్‌మండీలో కాంగ్రెస్ పార్టీ సంబురాలు

బౌద్ధనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 56శాతం ఉన్నారని, బీసీ బిల్లుకు ఏ పార్టీలు మద్దతు ఇస్తాయో చూద్దామని మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. జనహిత పరిపాలనకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సీతాఫల్‌మండి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసభ, కాంగ్రెస్ పార్టీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబురాల్లో మాజీ ఎంపీ వి.హెచ్.హన్మంతరావు, సికింద్రాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు దీపక్‌జాన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్, కరెంట్, గ్యాస్ సబ్సిడీ, పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్‌లు, రైతులకు రుణమాఫీ చేశారన్నారు. అనంతరం సికింద్రాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు దీపక్‌జాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లో రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్, యువనాయకుడు ఆదం సృజన్, నాయకులు అనిల్‌కుమార్, జగ్గు, అమర్‌నాథ్, షకీల్‌ఖాన్, వాహీదుద్దీన్, శిల్పాచారి తదితరులు పాల్గొన్నారు.

బాపుబాగ్‌లో కార్పొరేటర్ బస్తీబాట



బస్తీబాటలో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని పీజీరోడ్‌లో గల బాపుబాగ్‌లో బాపుబాగ్ విమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర వివిధ శాఖల అధికారులతో కలిసి బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి కాలనీ వాసులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో కాలనీలో మందుబాబుల బెడద ఉందని మహిళలు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి అక్కడే ఉన్న రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావుకు సూచించారు. అలాగే మూడు ప్రదేశాల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతుందని, కాలనీలో విద్యుత్‌లో ఓల్టేజీతో సరఫరా అవుతుందని వీధి దీపాల సమస్య ఉందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఆయా శాఖల అధికారులకు సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చీర సుచిత్ర మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కాలంలో సమస్యలపై ఏవిధంగా స్పందించామో అలాగే నిత్యం ప్రజల మధ్య ఉంటామని, సమస్యలు ఏదైనా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, విమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

మల్కాజిగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వీధుల్లో ఫుట్‌పాత్‌లపై ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులకు, వృద్ధు లకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి సఫిల్‌గూడ, గౌతంనగర్, తుకారాంగేట్ వరకు ప్రధాన రహదారుల పక్కన, ఫుట్‌పాత్‌ల పక్కన, చలికి వణుకుతూ నిద్రిస్తున్న వారిని గుర్తించి వారికి దుప్పట్లను అందజేశారు. జోన్‌చైర్‌పర్సన్ లయన్ ఎన్.రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో లయన్ కిరణ్‌కుమార్, గంగాదరబాబు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం నాయకులు

లంబాడాలకు ఎస్టీ హోదా కొనసాగిస్తే ఉద్యమమే

- ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లంబాడాలకు ఎస్టీ హోదా కొనసాగిస్తే ఉద్యమం తప్పదని ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బట్ట వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950 తర్వాత తెలంగాణకు వలస వచ్చిన లంబాడ, బంజారా, సుగాలి వర్గాలకు ఎస్టీ హోదా ఇవ్వకూడదని హైకోర్టు తాజా తీర్పు వచ్చినా ప్రభుత్వం ఇంకా స్పందించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. 1950లో ఈ వర్గాలు తెలంగాణ ఎస్టీ జాబితాలో లేరని, ఆర్టికల్ 342 ప్రకారం కూడా చేర్చలేదని అయినా నేటికీ ప్రయోజనాలు పొందుతున్నారని విమర్శించారు. తొమ్మిది ఆదివాసీ తెగలు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు రాష్ట్రం, కేంద్రానికి నోటీసులు జారీ చేసినా ప్రభుత్వం మౌనంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం నాయకులు రేగా శ్యామ్, కోర్సా ధర్మరాజు, కొడెం పాపారావు, సువార్త, ఈసం పవన్ కుమార్, పెందూరు సోనేరావు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ

కవాడిగూడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయ సమీపంలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేముల రామకృష్ణ విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మిట్ల పేరుతో రూ.వేల కోట్లు వృథా చేయడం కాదని విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించాలని సూచించారు. రాష్ట్రంలోని 12.75లక్షల మంది విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలు దాదాపు రూ.10వేల కోట్లు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టాలని ఒత్తిడి తీసుకువస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు ఫీజుల బకాయిల కోసం పాదయాత్ర చేసిన విద్యార్థి నాయకులు రాకేష్, గోనేశ్రీ, పవన్, మోహన్, సాయి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

సీపీఎస్ అమలు చేయాలి

- ఓయూ రిజిస్ట్రార్, ఓఎస్‌డీకి వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అధ్యాపకులు సోమవారం ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలనా భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ప్రొఫెసర్లు చంద్రశేఖర్, శ్రీనివాసులు, కాశీం, లావణ్య, మల్లేశం, వెంకటలక్ష్మి, కొండా నాగేశ్వర్ సీపీఎస్ అమలు అత్యవసరాన్ని వివరించారు. ఏడాది నుంచి విద్య, పరిశోధన, మౌలిక సదుపాయాల్లో ఓయూ పురోగతి సాధించిందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు వీసీ కుమార్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. 20 ఏళ్లుగా సీపీఎస్ అమలు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అనంతరం అధ్యాపకులను ఉద్దేశించి రిజిస్ట్రార్, ఓఎస్డీ మాట్లాడుతూ ఎరియర్స్, సీఏఎస్, పదోన్నతులు వంటి అనేక సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని చెప్పారు. సీపీఎస్ అంశంపై వైస్ చాన్స్‌లర్ సానుకూలంగా ఉన్నారని, త్వరలో పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూకు సీఎం రాకను స్వాగతించాలి

- విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కుమార్

రామంతాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రపంచస్థాయి యూనివర్సిటీలకు దీటుగా అభివృద్ధి చేయడానికి ఈ నెల 10న రాబోతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు స్వాగతించాలని విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్ కుమార్ కోరారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ భర్తీలపై స్పష్టత ఇవ్వాలని, యూనివర్సిటీ హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న వి.హనుమంతరావు, తదితరులు

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

తార్నాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు పి. కుమార్ వంశీరాజ్ సోమవారం పలువురు స్థానిక యువకులతో కలిసి సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఎస్. జగన్, వంశీ, యశ్వంత్, పి. మల్లేష్, ఏ. శ్రీనివాస్, ఎస్. చందు, చంద్రశేఖర్, శ్రీకాంత్, దాస్, ప్రసాద్, సూర్య భగవాన్, చిన్ను తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

చెన్నకేశవులుకు డాక్టరేట్



రాంగోపాల్‌పేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని వెస్లీ డిగ్రీ కళాశాలలో పనిచేసే నల్లమోపు చెన్నకేశవులకు జేజేటీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రాజస్థాన్‌కు చెందిన శ్రీజగదీష్ ప్రసాద్ జబర్‌మల్ టిబ్రేవాల యూనివర్సిటీ (యూనివర్సిటీ)లో కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ ప్రసాదు పెద్ది పర్యవేక్షణలో ఎఫిషియెంట్ క్లస్టర్ హెడ్ సెలక్షన్ అండ్ డాటా అగ్రిగేషన్ స్ట్రాటజీ యూసింగ్ ఎన్‌హన్స్‌డ్ లీచ్ ప్రోటోకాల్ ఫర్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్స్ అనే అంశంపై ఆయన విజయవంతంగా పరిశోధనను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన చెన్నకేశవులును వెస్లీ కళాశాల డైరెక్టర్ & ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విమల్ సుకుమార్, డాక్టర్ పిఎం మోహన్, డాక్టర్ విఆర్‌కె రాజు ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

ఫుట్‌పాత్‌పై డబ్బాలను తొలగించండి



ఫుట్‌పాత్‌పై వెలిసిన డబ్బాలు

అడ్డగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైల్‌నిలయం అంబేద్కర్‌నగర్ బస్తీ నుంచి టీచర్‌కాలనీ వైపున ఫుట్‌పాత్ పై వెలిసిన డబ్బాలు, దుకాణాలను తొలగించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా మాజీ కార్యదర్శి రౌతు రాజయ్య సోమవారం హైడ్రా కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌పాత్ వెలిసిన డబ్బాల వల్ల రైల్ నిలయం సికింద్రాబాద్ నుంచి అంబేద్కర్‌నగర్ మీదుగా టీచర్స్ కాలనీ వైపువెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

'ప్రభుత్వ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడండి'

అంబేద్కర్‌నగర్ బస్తీ ఎదురుగా ఉన్న సర్వే నెంబరు 11/13 ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రౌతు రాజయ్య సోమవారం మారేడుపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని 2012లో జిల్లా కలెక్టర్, సికింద్రాబాద్ ఆర్డీఓ, మారేడుపల్లి తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ప్రస్తుతం కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని రెండోసారి సోమవారం మారేడుపల్లి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

నగరంలో పంచాయతీ ఎన్నికల ప్రచారం

సికింద్రాబాద్/బోయినపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల ప్రచారం నగరంలో ఊపందుకుంటోంది. ఇదేంటి? పంచాయతీ ఎన్నికలు జరిగేది గ్రామాల్లో కదా.. నగరంలో ప్రచారం ముమ్మరం చేయడమేమిటబ్బా! అని అనుకుంటున్నారా?..... అసలు విషయం ఏమిటంటే.. జీవనోపాధి నిమిత్తం రాష్ట్రం నలు మూలల నుంచి ఎంతోమంది నగరానికి వలస రావడం తెలిసిందే. ఇదే తరహాలో వచ్చినవారు కొందరు బోయినపల్లి పరిసరాల్లో నివసిస్తున్నారు. వారి ఓటుహక్కు ఆయా గ్రామాల్లో ఉండడంతో అక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇక్కడికి వచ్చి, ప్రచారం చేస్తుండడం విశేషం. అందులో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి పెద్ద తండా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రత్నావత్ రాజ్యానాయక్ బోయినపల్లిలోని పెట్రోల్ బంకు అడ్డా, బాపూజీనగర్‌లోని పలువురు కూలీలను, ఆటో డ్రైవర్లను(తమ ఓటర్లను) కలిసి తనకే ఓటు వేసి గెలిపించాలంటూ ప్రచారం చేసుకుంటున్నారు. దాంతో బోయినపల్లి పరిసరాల్లో ఎన్నికల కోలాహలం కనిపించింది.





ఎన్నికల ప్రచారం చేస్తున్న వనపర్తి మండలం పెద్ద తండా గ్రామ సర్పంచ్ అభ్యర్థి